"అదెప్పుడు మునిగిందండి?" గలగలా నవ్వాడు వాడు నా వంక అల్లరిగా చూస్తూ.

"పొద్దున నువ్వే చెప్పావుగా?"

"అలా చెప్పబట్టే నా పడవెక్కారు ఎందుకు మునిగిందో తెలుసుకుందామని తమరు నా కోసం ఆగి మరీవచ్చి నా పడవే ఎక్కారు. అలా ఎక్కుతారని తెలిసే చిన్న కథ అల్లానంతే. ఆ తెల్ల పడవ మా అయ్యదే నిజానికి" తెడ్డువేస్తూ చెప్పాడు.

అప్పుడు జరిగిందా సంఘటన ఆ దృశ్యం చూసి అతని రోమాలు నిక్కబొడుచుకుని స్థాణువుల్లా నిల్చుండిపోయాడు.

సీరియల్ నవలల్లో ప్రతి సంచికలో అలాటి ఆఖరి వాక్యాలు రచయితలు ఎందుకురాస్తారో నాకాక్షణం అర్థమైంది.

# అభిమాని

రచయిత అయ్యాక చాలామంది రచయితలకి జీవితమంతా థ్రిల్లే. కథని వేసుకుంటున్నామంటూ వచ్చే అచ్చయిన కార్డు మొదటి థ్రిల్. ఆ కథ అచ్చులో చదువికోవడం మరో థ్రిల్. దాన్ని మిత్రులు, బంధువులు బావుందని పొగిడితే ఇంకో థ్రిల్. కొద్ది కాలం పోయాక దాన్ని కన్నడంలోకో, హిందీలోకో అనువదిసామంటూ అనువాదకురాలినించి వచ్చే ఉత్తరం చెప్పలేని థ్రిల్. పరభాషా పత్రిక పంపే చెక్ రచయితకే కాక రచయిత భార్యకి కూడా థ్రిల్ కనిగిస్తుంది. రచయితగా ఎక్కువ మంది స్థిరపడటానికి ప్రయత్నించక పోవటంతో కొద్ది సంవత్సరాల్లో రచనలు మానేస్తూంటారు.

వదలకుండా రచనలు, అతి ముఖ్యంగా మంచి రచనలు చేస్తుంటే అసలయిన థ్రిల్ రచయిత అనుభవిస్తాడు.

అదే అభిమానుల నుంచి వచ్చే ఉత్తరాలు.

మొదటి ఉత్తరం ఏదో మానసికానందానికి గురిచేస్తుంది. లాటరీలో లక్ష వచ్చినా బహుశ అంత ఆనందం కలగకపోవచ్చు. ఆ ఉత్తరం రాసింది అమ్మాయే అయితే థ్రిల్లేస్ట్ థ్రిల్ అయికూర్చుంటుందా సందర్భం.

రచయిత ఎంజాయ్ చేసే బై ప్రొడక్ట్ అభిమానుల ప్రశంస.

* * * *

ఆరోజు ఆఫీసుకి ఎంతో విసుగుతో వెళ్ళాను. ఆడిటర్స్ గత వారంగా నానారకాలుగా ఇబ్బంది పెడుతున్నారు. ఫేలీ అయిన బేలన్స్ షీట్ మళ్ళీ మార్చాల్సి వచ్చింది.

పోస్టుమెన్ నా ఉత్తరాలు అందించి వెళ్ళాడు. గులాబిరంగు కవరు మీద నల్ల బాల్ పెన్‌తో నా చిరునామా ఎంతో అందంగా రాసి వుంది.

ఆ కవరు పంపిన అమ్మాయి పేరు శివతేజ.

కవరు చింపి ఉత్తరం బయటకు తీసి మడతలువిప్పాను. నే కథల్లో రాసినట్లు క్షణకాలం గుండె ఆగిన ఫీలింగ్.

ఎదురుగా మల్లెపువ్వులా తెల్లగా వున్న కాగితంమీద ఎర్రటి అక్షరాలు.

నా నవలలని పొగుడుతూ కర్నూల్ నించి శివతేజ అనే అమ్మాయి రాసిన ఉత్తరం.

"మీరంటే, మీ రచనలంటే నాకెంత అభిమానమో తెలియచేయడానికి నా రక్తంతో ఈ ఉత్తరాన్ని రాస్తున్నాను. తెలుగులో నా అభిమాన రచయిత మీరొక్కరే!"

ఆ ఉత్తరాన్ని గుండెలకి హత్తుకోకుండా వుండలేక పోయాను.

* * * *

అయిదారు నెలల తర్వాత ఓ రోజు ఓ పత్రికాఫీసులో మరొక తోటి రచయిత చెప్పాడు సందర్భం వస్తే

"అభిమానులందరికీ వుంటారు. కాని కర్నూల్లోని నా అభిమాని లాంటి అభిమాని అరుదు ఆ అమ్మాయి మొదటి ఉత్తరం రాసేప్పుడు సిరా బదులు తన రక్తాన్ని వుపయోగించింది తెలుసా ? తెలుగులో నా కథలు మాత్రమే చదువుతుందిట.

అక్కడే వున్న మరో రచయిత తెల్ల మొహం వేసూ అడిగాడు.

"అంటే శివతేజ హైద్రాబాద్ వచ్చినప్పుడల్లా నిన్నూ కలుస్తూంటుందా?"

# వీళ్ళెప్పుడూ ఇంతే!

రాజేంద్ర మా ఆఫీసులో యు. డి. సి.గా పనిచేస్తున్నాడు. దాదాపు మూడు వేలమంది పని చేసే రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయంలో రాజేంద్ర అందరికీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పరిచయస్తుడే

కారణం రాజేంద్ర రచయిత. అతని కథలు చాలా పత్రికల్లో వచ్చాయి. నాటకాలు రాసాడు. నాటకాల్లో నటిసాడు.

రాజేంద్ర పనిచేసే సెక్షన్లోనే నేను కూడా పనిచేస్తున్నాను. రాజేంద్ర ఇంట్లో పేయింగ్ గెస్ట్‌గా వుంటున్నాను కాబట్టి మా ఇద్దరిమధ్య సాహిత్యం అధికం. ఇద్దరం బ్రహ్మచారులం కాబట్టి ప్రతి శనివారం సెకండ్ షోకి వెళ్ళి అర్ధరాత్రి దాటాక ఇంటికి చేరుకుంటాం. రాజేంద్ర తల్లి వంట అతని రచనల కన్నా ఎంతో బావుంటుందన్న సంగతి రాజేంద్ర కూడా ఒప్పుకుంటాడు.

రాజేంద్ర రాసిన రేడియో నాటిక ఒకటి ప్రసారానికి అంగీకరింపబడింది. దాన్లో రాజేంద్ర కూడా ఓ పాత్ర వేస్తున్నాడు. ఆలిండియా వారి ఆడిషన్ టెస్టులో పాస్ అయ్యాడు. వారి కేజువల్ ఆర్టిస్టుల జాబితాలో రాజేంద్ర పేరుకూడా వుంది.